బాబ్లీ నుంచి ఔట్‌ఫ్లో అంతంతే ..

- 0.6 టిఎంసిల నీటివిడుదలకు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

సుప్రీంకోర్టు తీర్పులో భాగంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శనివారం ఎత్తారు. మార్చి 1న 0.6 టిఎంసిల నీటిని బాబ్లీ ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి విడుదల చేయాల్సి ఉంటుంది. ఉత్తర్వుల్లో భాగంగా తెలంగాణ సీడబ్ల్యూసీ అధికారులు, మహారాష్ట్ర అధికారుల సమక్షంలో శనివారం బాబ్లీ గేట్లు ఎత్తారు. కానీ బాబ్లీ ప్రాజెక్టులో నీరు అంతంత మాత్రమే ఉండటంతో ఎస్సారెస్పీకి ఇన్‌ఫ్లో వచ్చి చేరడం తక్కువే. బాబ్లీ ప్రాజెక్టు నుంచి ప్రతేడాదీ 0.6 టీఎంసీలకు బదులుగా 0.2 టీఎంసీల నీరు మాత్రమే ఎస్సారెస్పీలోకి వస్తోంది. ఈ సంవత్సరం కూడా తగిన నీరు లేకపోవడంతో ఎస్సారెస్పీలోకి పూర్తి స్థాయిలో నీరు చేరే అవకాశం కనిపించడం లేదు. ఈ కార్యక్రమంలో హైదారాబాద్ యుజిడి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇ.వెంకటేశ్వర్లు, ఎస్సారెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.చక్రపాణి, ఎఈఈలు కొత్త.రవి, విన్యాస్, సుశాంత్, మహారాష్ట్ర నాందేడ్ డిప్యూటి ఇంజినీర్ ప్రశాంత్ కదమ్, జూనియర్ ఇంజినీర్ సచిన్ దేవకంబ్లే పాల్గొన్నారు.

ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

- కన్వీనర్ డీన్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిరోజు ఇంజనీరింగ్ విభాగానికి 3,116 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,891 మంది, రెండింటికీ ముగ్గురు కలిపి మొత్తం 5,010 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వచ్చేనెల నాలుగో తేదీ వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశముందని తెలిపారు. ఆలస్య రుసుంతో అదేనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం https:// eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

28 రక్తనిధి కేంద్రాల్లో తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘించిన సెంటర్లపై చర్యలు : డిసిఎ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఫిబ్రవరి మాసంలో 28 రక్తనిధి కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించినట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డిసిఎ) తెలిపింది. ఈ మేరకు డిసిఎ డైరెక్టర్ జనరల్ విబి.కమలాసన్ రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సరిగ్గా రక్తం, రక్తంలోని కాంపొనెంట్స్‌ను పరీక్షిస్తున్నారా? నిల్వ పరిస్థితులు ఎలా ఉన్నాయి? ప్రాసెసింగ్ ఛార్జెస్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో 14 బ్లడ్ సెంటర్లు నిబంధనలు ఉల్లంఘించినట్టు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు నాలుగు సెంటర్లపై చర్యలు తీసుకున్నారు. సిద్ధిపేట జిల్లా రాయిపోల్ మండలం, బేగంపేట్ గ్రామంలో నకిలీ వైద్యులు కె.రామాంజనేయులు నిర్వహిస్తున్న మారుతీ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌పై దాడి చేసి రూ.30 వేల విలువైన 14 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. ఆహారోత్పత్తుల పేరుతో లైసెన్స్ తీసుకుని అమ్ముతున్న దవాఫర్-ఎక్స్‌టి టాబ్లెట్స్‌ను మలక్‌పేటలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సికింద్రాబాద్, హైదరాబాద్, నారాయణపేట్, మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో తప్పుడు ప్రకటనలతో అమ్ముతున్న మందులను సీజ్ చేశారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖనిజ అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం

- ప్రభుత్వ పనులకు టిజిఎండిసి నుంచే ఇసుక సరఫరా
- గనుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇసుకతోపాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమనీ, ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచొచ్చని సూచించారు. హైదరాబాద్‌లోని ఐసిసిసిలో గనుల శాఖపై సిఎం శనివారం సమీక్ష నిర్వహించారు. గత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిన విధానాన్నీ, పెరిగిన ఆదాయాన్ని అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరాపై అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు. ప్రభుత్వంలోని నీటి పారుదల, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్‌తోపాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు టిజిఎండిసి నుంచే ఇసుక సరఫరా చేసేలా చూడాలన్నారు. పెద్ద మొత్తంలో నిర్మాణాలు చేపట్టే నిర్మాణ రంగ సంస్థలకు అవసరమైన ఇసుకను ఆ సంస్థ నుంచే సరఫరా చేయాలని ఆదేశించారు. సరైన ధరలకు ప్రభుత్వమే ఇసుక సరఫరా చేస్తే అక్రమంగా సరఫరా చేసే వారిపై వినియోగదారులు ఆధారపడరని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరంతోపాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక వినియోగం ఎక్కువగా జరుగుతోందన్నారు. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపైనా అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విధానపరమైన నిర్ణయం త్వరగా తీసుకుని సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మైనర్ ఖనిజాల బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. సమీక్షలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టిజిఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ కె.శశాంక, గనుల శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్, టిజిఎండిసి ఎండి సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ తరహాలో పోలీస్ స్కూలు

సైనిక్ స్కూల్ తరహాలో పోలీస్ స్కూల్ కూడా దేశానికే రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ బ్రోచర్, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. స్కూల్ యూనిఫార్మ్ నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ విద్యా విధానంలో కొత్త ఒరవడిని అవలంభించాలన్నారు. క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పోలీస్ అమరుల కుటుంబాల పిల్లలకు అడ్మిషన్లలో మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మార్చడమే లక్ష్యం

- గ్రోత్ ఎక్స్‌పో సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్ బాబు

గ్రోత్‌ఎక్స్‌పో సమ్మిట్‌లో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రాన్ని ఒక్క ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు అన్నారు. హెచ్ఐసిసిలో "గో డిజిటల్ గ్రో బిజినెస్" అనే థీమ్‌తో ఏర్పాటైన గ్రోత్‌ఎక్స్ 2025 సమ్మిట్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఐటి, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, కేంద్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ భవాని హాజరయ్యారు. "డిజిటల్ ఆవిష్కరణలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా పరిశ్రమలు కూడా ముందుకు సాగాలి. మన పరిశ్రమలను మనం మార్చుకోవాలి. సంప్రదాయ విధానాలు పనిచేయవు. అదే సమయంలో ఈ ప్రయాణంలో సవాళ్లు ఉన్నాయి." అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

ఉర్దూ మాధ్యమ పాఠశాల సమయపాలనలో మార్పు

- విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రంజాన్ పండుగ నేపథ్యంలో ఉర్దూ మాధ్యమం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలతోపాటు డైట్ కాలేజీల సమయపాలనను ప్రభుత్వం మార్పు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ సంయుక్త సంచాలకులు పి మదన్‌మోహన్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయా పాఠశాలలు, కాలేజీలు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ఆదివారం నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తెలిపారు. ఆర్‌జెడిలు, డిఇఒలు ఈ ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు.

అత్యుత్తమ మహిళా సాధికారత విధానం

- 8న పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణ
- ఆ వేదిక నుంచే పలు పథకాలు ప్రారంభం
- ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే అత్యుత్తమ మహిళా సాధికారత విధానాన్ని రూపొందిస్తామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) నొక్కి చెప్పారు. మార్చి ఎనిమిదిన సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ వేదిక నుంచే మహిళల కోసం పలు పథకాలను సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించబోతున్నారని తెలిపారు. ఆర్థిక రంగంలో తెలంగాణ గ్రామీణ మహిళలు సాధించిన విజయాలను ప్రపంచానికి చాటాలని అధికారులకు సూచించారు. మహిళా దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అందులో మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెలా గద్దర్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన, స్పెషల్ కమిషనర్ బీ. షఫీ ఉల్లా, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, తదితరులు హాజరయ్యారు. మహిళా సాధికారత కోసం కొత్తగా తీసుకోబోయే కార్యక్రమాలపై చర్చించారు. ఎనిమిదిన జరిగే సభలో సిఎం, డిప్యూటీ సిఎం, ఇతర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాలచే ఏర్పాటు చేయబోయే సోలార్ విద్యుత్ ప్లాంట్లకు సిఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మహిళా స్వయం సహాయక బృందాలతో కొనుగోలు చేయించిన 50 ఆర్‌టిసి అద్దె బస్సులను సిఎంతో ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నారాయణపేట జిల్లాల్లో మహిళా సంఘాలు ప్రారంభించిన పెట్రోల్ బంక్ తరహాలోనే మిగిలిన 31 జిల్లాల్లోనూ పెట్రోల్ బంకులు ప్రారంభించేలా బిపిఎల్, హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్ వంటి ఆయిల్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుందని తెలిపారు. దీంతో పాటు వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళా సంఘాలకు అందచేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన 400 మంది మహిళా సంఘ సభ్యులకు రూ.40 కోట్ల ప్రమాద బీమా చెక్కులను అందచేయనున్నట్టు తెలిపారు. ఇక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 14 వేలకు పైగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నియామకాల ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి-2025 విధానాన్ని ప్రకటిస్తామని చెప్పారు. మహిళా ప్రాంగణాల్లో మహిళలకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో ఆయా మహిళలకు సబ్సిడీలో ఆటోలు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. పట్టణాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేసేలా ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశముందన్నారు. సెర్ప్, మెప్మాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

- విడిఎ పాయింట్ రేటు రూ.12 నుంచి రూ.26.54 మధ్య ఉండాలి
- కార్మిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కుమార్‌కి సిఐటియు వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలను సవరించాలనీ, వెంటనే ఫైనల్ జిఒలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని కోరారు. కనీస వేతనాల సలహా మండలిలో సిఐటియుకి ప్రాతినిధ్యం కల్పించకపోవడాన్ని తప్పుబట్టారు. గుర్తింపు పొందిన అన్ని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలకు సలహామండలిలో ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కార్మిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కుమార్‌కి సిఐటియు బృందం వినతిపత్రం అందజేసింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జె.మల్లిఖార్జున్, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, కూరపాటి రమేష్, బి.మల్లేశ్ పాల్గొన్నారు. అనంతరం చుక్కరాములు, పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు కోటి 20 లక్షల మంది కార్మికులకు లబ్ది చేకూర్చే షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ జిఒలను ఉమ్మడి రాష్ట్రంలో 2006-12 మధ్యకాలంలో సవరించారనీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఒక్కసారి కూడా సవరించలేదని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సమావేశాలకు, ప్రతిపాదనలకే పరిమితమైందని వివరించారు. దీనివల్ల లక్షలాది మంది కార్మికులు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. ఇంటిఅద్దెలు, నిత్యావసర సరుకుల ధరలు, విద్యా, వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయయనీ, జీతాలు మాత్రం ఇసుమెత్తయినా పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఐఎలెసి తీర్మానం, ఆక్రాయిడ్ ఫార్ములా, 1992 సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా లెక్కించి వేతనాలు నిర్ణయించాలని విన్నవించారు. యాజమాన్యాల ఒత్తిడికి లొంగి గెజిట్ చేయకుండా కార్మికులకు అన్యాయం చేయడం సరిగాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల తిరగకముందే 2024 జనవరి 29న అన్ని షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌కు డ్రాఫ్ట్ జిఒలు నెం.50 నుండి 123 వరకు జారీ చేసిందనీ, వేతనాలు మాత్రం పెంచలేదని ప్రస్తావించారు. గత జిఒలోని బేసిక్‌కు విడిఎ పాయింట్ల రేట్లకు కలిపి కొత్త బేసిక్‌గా నిర్ణయించారనీ, దీనివల్ల కార్మికులకు వేతనాలు ఒక్క రూపాయి కూడా పెరిగింది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2021లో పెంచిన వేతనం కన్నా తక్కువ నిర్ణయించిందని వాపోయారు. విడిఎ పాయింట్ రేటు కనీసం రూ.12 నుంచి రూ.26.54 మధ్య ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

వాహన విక్రయ నిబంధనలు పాటించాల్సిందే

- రవాణా శాఖ విజిలెన్స్ జాయింట్ కమిషనర్ చంద్ర శేఖర్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రవాణా శాఖ నిబంధనలు పాటించకుండా వాహనాలను విక్రయిస్తున్న షోరూం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ విజిలెన్స్ జాయింట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ హెచ్చరించారు. వాహనాలను విక్రయించేటప్పుడు ఆర్‌టిఎ ఛార్జెస్ లేదా హ్యాండ్లింగ్ ఛార్జింగ్ పేరిట వాహనదారుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తే ఆ షోరూమ్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారి తాత్కాలిక రిజిస్ట్రేషన్ ఆథరైజేషన్ సస్పెండ్ చేయడంతోపాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీవిత కాలపు పన్ను చెల్లింపులోగానీ, వాహనదారుడు రెండో వాహనం కొనుగోలు చేసే సమయంలో విధించాల్సిన అదనపు జీవిత కాలపు పన్ను విషయంలోగానీ నిబంధనలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏ వాహన షోరూమ్ అయినా హ్యాండ్లింగ్ ఛార్జీల పేరిట అదనపు రుసుము వసూలు చేస్తే ఆ వాహనదారుడు రుజువులతో కూడిన ఫిర్యాదును సంబంధిత జిల్లా రవాణా శాఖాధికారికిగానీ, రవాణా కమిషనర్ కార్యాలయానికిగానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ జరిపి సంబంధిత వాహన షో రూమ్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్యాగులు మోయొద్దనడం పెద్ద జోక్

- రేవంత్‌రెడ్డి చరిత్రంతా బ్యాగులు మోయడమే
- రూ.1.5 లక్షల కోట్లు అప్పు చేసి కమీషన్లు దండుకుంటున్నరు : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బ్యాగులు మోసి సిఎం అయిన రేవంత్‌రెడ్డిని పక్కన కూర్చోబెట్టుకుని బ్యాగులు మోయవద్దని కాంగ్రెస్ రాష్ట్ర కొత్త ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కె.తారకరామారావు విమర్శించారు. అప్పట్లో చంద్రబాబుకు బ్యాగులు మోస్తే ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానానికి రేవంత్ రెడ్డి బ్యాగులు మోస్తున్నారని ఆరోపించారు. హైడ్రా విధ్వంసం, ఆర్ఆర్ టాక్స్, భూకబ్జాలు, అంతులేని అవినీతితో కుప్పకూలిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్, మొన్ననే కొట్టుకపోయిన పెద్దవాగు, మునిగిన వట్టెం పంప్ హౌస్ ఇలా చెప్పడం మొదలుపెడితే రేవంత్ చెవుల నుంచి రక్తం కారడం ఖాయమన్నారు. శనివారం హైదరాబాద్‌లో చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండల మాజీ ఎంపిపి గోవర్ధన్ రెడ్డితో పాటు సుమారు 500 మంది బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రేవంత్ రెడ్డిని తిట్టని వ్యక్తి లేరన్నారు. జనవరి 26న ఖాతాల్లో డబ్బులు పడతాయని హామీ ఇచ్చి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఒక్క పథకం కూడా అమలు చేయలేదని ఎత్తిచూపారు. కేసీఆర్ హయాంలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో విధ్వంసం, అరాచకాలతో కుప్పకూలిందని విమర్శించారు. హైడ్రా, మూసి కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని దెబ్బతీశారన్నారు. మేడ్చల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం దురదష్టకరమని వాపోయారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా పది శాతం పనులు పూర్తిచేస్తే చేవెళ్లకు నీళ్లొస్తాయని గుర్తుచేశారు. కానీ, దాన్ని పక్కనపడేసి మూసీ సుందరీకరణ కోసం రూ.1,50,000 కోట్లు ఖర్చు చేసి కమీషన్లు దండుకొని, కాంగ్రెస్ అధిష్టానానికి పంపి తన పదవి కాపాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి హయాంలో నీళ్లు పాతాళంలోకి, నిధులు ఢిల్లీకి వెళు తున్నాయని ఎద్దేవా చేశారు. రుణమాఫీ, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఒక్క ఏడాదిలోనే రూ.1,50,000 కోట్ల అప్పు చేసి ఒక్క కొత్త పథకం కూడా ప్రారంభించలేదని విమర్శించారు. 450 మంది రైతులు, ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా పట్టదా? అని నిలదీశారు.

క్రేన్ ఢీకొని తండ్రీకొడుకు మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వేగంగా వెళుతున్న హైడ్రా క్రేన్ అదుపు తప్పి సైకిల్‌ను ఢీకొట్టడంతో తండ్రి, కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని కోతులనడుమ గ్రామంలో జరిగింది. స్థానికులు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోతుల నడుమ గ్రామానికి చెందిన తంగెడ రాజేశ్వరరావు (63) దివ్యాంగుడైన తన కుమారుడు తంగెడ వికాస్‌రావు (31)ను సైకిల్‌పై కూర్చోబెట్టుకుని వల్లభాపూర్ గ్రామానికి బయలుదేరాడు. వారు కోతులనడుమ బస్టాండ్ దాటగానే హైడ్రా క్రేన్ అతివేగంతో సైకిల్‌పై వెళుతున్న రాజేశ్వరరావును వెనుక నుంచి ఢీకొట్టింది. క్రేన్‌ను ఉత్తరప్రదేశ్‌కు చెందిన దిల్సాద్ అహ్మద్ నడుపుతున్నాడు. ఈ ప్రమాదంలో తండ్రి, కుమారుడు ఇద్దరూ కిందపడి పోవడంతో హైడ్రా క్రేన్ వారిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక వివరాలు సేకరించి నిందితుడిపై కేసు నమోదు చేశారు. తండ్రి, కొడుకు మృతితో కోతులనడుమ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడు రాజేశ్వర్‌రావు మరో కుమారుడు సాగర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

'మూసీ'పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మూసీ పునర్జీవం, సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమంపై అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య ప్రభుత్వాన్ని కోరారు. మూసీ శుద్ధికరణ, ప్రక్షాళనపై డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి గ్రామంలోని ఎస్ఆర్ఎస్ గార్డెన్‌లో శనివారం సిపిఎం జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మూసీ ప్రక్షాళన అంశాన్ని సిపిఎం స్వాగతిస్తుందన్నారు. అయితే, మూసీని ఆధారం చేసుకుని ఇరువైపులా జీవిస్తున్న పేద, మధ్యతరగతి ప్రజల నివాస ప్రాంతాలను కూల్చడం సరైనది కాదన్నారు. మూసీ కాలుష్యం నివారణకు సమగ్రమైన సర్వే చేసి.. అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ మాట్లాడుతూ.. పోచంపల్లి ప్రాంతం మొత్తంగా మూసీ ప్రాజెక్టు ఆధారితంగా రైతులు పంటలను సాగు చేస్తూ జీవిస్తున్నారని చెప్పారు. మూసీ శుద్ధీకరణకు అవసరమైన చోట ఇటిపిలు, ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన కోసం రానున్న కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జెల్లెల పెంటయ్య పాల్గొన్నారు.

మహిళా వ్యాపారులను శక్తి అవార్డులతో సత్కరిస్తున్న గ్లోరీ స్వరూప

శక్తి అవార్డులతో మహిళ వ్యాపారులకు సత్కారం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సిఒడబ్ల్యుఇ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక ఉమెన్ ఇంటర్నేషనల్ సమిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్షిప్ (డబ్ల్యుఐఎస్ఇ), బి2బి ఎక్స్‌పో 2025లో శక్తి అవార్డులతో మహిళ వ్యాపారులకు సత్కారం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో రెండో రోజూ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టిఎస్ఐఐసి) చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుంచు గ్లోరీ స్వరూప హాజరయ్యారు. సిఒడబ్ల్యుఇ జాతీయ అధ్యక్షురాలు లలితా ఆలూరి, వ్యవస్థాపక డైరెక్టర్ సుమన్ కుమార్ హాజరయ్యారు. తుది సెషన్లు ప్రాక్టికల్ లెర్నింగ్, మహిళా వ్యాపారులను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లే నెట్‌వర్కింగ్ అవకాశాలపై చర్చించారు. ఈ సెషన్‌లో వినూత్న స్టార్టప్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణించిన 108 మంది మహిళా వ్యాపారులను శక్తి అవార్డులతో సత్కరించారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాలింత బంధువులు

ఆస్పత్రిలో బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనంటూ బంధువుల ఆందోళన
- సంగారెడ్డి వెల్నెస్ ఆస్పత్రిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెరుగైన వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన ఓ బాలింత మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఆమె మృతి చెందిందంటూ బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని వెల్నెస్ ఆస్పత్రిలో శనివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోహీర్ మండలం మదిరి గ్రామానికి చెందిన మహానందికి జహీరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఇటీవల ప్రసవం జరిగింది. అయితే, ఆమెకు రక్తస్రావం అధికంగా కావడంతో సంగారెడ్డిలోని వెల్నెస్ ఆస్పత్రికి శుక్రవారం తీసుకొచ్చారు. వైద్యులు ఆమెకు చికిత్స చేసిన వైద్యులు.. ఇక ఎలాంటి ఇబ్బందీ లేదని కుటుంబ సభ్యులకు తెలిపారు. కానీ, శనివారం ఉదయం మహానంది మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. దాంతో బంధువులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. ఆరోగ్యంగా ఉన్న మహిళ ఎలా చనిపోతుందని ప్రశ్నించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆరోపించారు. ఆస్పత్రి వద్ద పూలతొట్టీలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వాగ్వాదం, తోపులాట జరిగింది. బాలింత మరణానికి కారణమైన వైద్యులపై, ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిని సీజ్ చేయాలని, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆస్పత్రి ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంగారెడ్డి రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

HYPERSOFT TECHNOLOGIES LIMITED
CIN: L29309TG1983PLC003912
Registered Office: Unit 117, 1st Floor Techno-1 Sy. No. 86, 87(P), 88(P), 88/1, Raidurg, Serilingampally Mandal, Ranga Reddy, Madhapur, Hyderabad, Shaikpet, Telangana, India, 500081. **Website:** www.hypersoftindia.com
Email: info@hypersoftindia.com **Ph:** 8143858084

హైపర్‌సాఫ్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్ ("కంపెనీ") వీడియో కాన్ఫరెన్సింగ్(వీసి)/ ఇతర ఆడియో-విజువల్ మీన్స్ (ఓవివిఎం) ద్వారా సోమవారం, 10మార్చ్, 2025న ఉ.10.00గం.లకు ఐఎస్టీకి నిర్వహించుటకు షెడ్యూల్‌చేసిన కంపెనీ యొక్క సభ్యుల అసాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించుటకు 15 ఫిబ్రవరి, 2025 ("నోటీసు ఆఫ్ ఇజిఎం") నాటి నోటీసును జారీచేసింది. సంబంధిత రూల్స్‌తో చదవగల కంపెనీల చట్టం, 2013లోని నిబంధనలకు అనుగుణంగా కంపెనీ వాటాదారులకు ఇజిఎం నోటీసు పంపబడింది. ఈ సవరణ నోటీసు ఇవ్వడానికి జారీచేయబడింది:

1) ఇక్కడ పేర్కొన్న విధంగా తీర్మానం నెం.6లో "కంపెనీ యొక్క ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ మరియు" అనే పదాల తర్వాత "కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి మరియు అవసరమైన ఇతర ఆంక్షలు మరియు ఆమోదాలకు లోబడి ఉంటుంది మరియు" అనే పదాలను జోడించడం ద్వారా మార్పు.
2) నియామకం పొందిన వ్యక్తి పేరుకు ఎదురుగా డిఐఎన్ నంబర్‌ను జోడించడం

ఇతర ఈజిఎం నోటీసు మరియు వివరణాత్మక ప్రకటనలన్నీ మారవు.

ఈజిఎం నోటీసుకు సంబంధించిన ఈ సవరణ ఈజిఎం నోటీసులో అంతర్భాగంగా ఉంటుంది, ఇదిఇప్పటికే కంపెనీ వాటాదారులకు పంపిణీ చేయబడింది మరియు ఈ తేదీ నుండి, ఈజిఎం నోటీసు ఎల్లప్పుడూ ఈ సవరణతో కలిపి చదవబడుతుంది. ఈ సవరణ ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్(ఇంగ్లీష్) మరియు ప్రజాశక్తి(తెలుగు)లో కూడా ప్రచురించ బడుతోంది మరియు వెబ్‌సైట్ మరియు కంపెనీ వెబ్‌సైట్: (www.hypersoftindia.com) లో కూడా అందుబాటులో ఉంచబడుతుంది. ఈజిఎం నోటీసులోని అన్ని ఇతర విషయాలు, సవరణ లేదా సవరణ ద్వారా తప్ప, ఏలాంటి మార్పులు లేవు.

హైపర్‌సాఫ్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్ కోసం
సం/-
మనోహర్ రెడ్డి పాండి
కంపెనీ సెక్రటరీ మరియు కంప్లైయన్స్ ఆఫీసర్
ఎం.నెం.: ఏ35524

ప్రదేశం: హైదరాబాద్
తేదీ: మార్చి 01, 2025

విద్యుత్ తీగలు తగిలి మహిళ దుర్మరణం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అడవి జంతువుల నుంచి పంటను రక్షించుకునేందుకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఓ మహిళ మృతి చెందారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్యానాయక్ తండాకు చెందిన లావుడ్యా పౌరలి (50) లచ్చపేట శివారులో పంట పొలం వద్ద విద్యుత్ తీగలు తగిలి మృతి చెందారు. అయితే, ఆమె అటువైపు ఎందుకు వెళ్లిందనే వివరాలు తెలియలేదు. పోలీసులు కేసు విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని ఎఎస్పీ చైతన్యరెడ్డి, రూరల్ సిఐ రామన్, మాచారెడ్డి ఎస్ఐ అనిల్‌కుమార్ పరిశీలించారు.

గాయపడిన డాక్టర్ సుమంత్ మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వరంగల్‌లో సంచలనం సృష్టించిన హత్యాయత్నం ఘటనలో తీవ్రంగా గాయపడిన యువ వైద్యుడు సుమంత్ రెడ్డి మృతి చెందారు. ఫిబ్రవరి 20న వరంగల్ భట్టుపల్లి రోడ్డు ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ సమీపంలో డాక్టర్ సుమంత్ రెడ్డిపై ఆయన భార్య ఫ్లోరా, ఆమె ప్రియుడు సామ్యేల్, ఎఆర్ కానిస్టేబుల్ కలిసి పక్కా ప్రణాళికతో దాడి చేసిన విషయం విదితమే. తమ వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని సుమంత్‌ను హత్య చేసేందుకు ప్రియుడు సామ్యేల్‌తో కలిసి సుమంత్ భార్య ఫ్లోరా పథకం వేసింది. గత నెల 20న ఆస్పత్రి విధులు ముగించుకుని సుమంత్ కారులో ఇంటికి వెళ్తుండగా.. నిర్మానుష్య ప్రాంతంలో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సుమంత్‌కు వరంగల్ ఎంజీఎం చికిత్స అందించారు. అయినా ఫలితం లేక పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు. కాగా, దాడి ఘటనలో సామ్యేల్, అతనికి సహకరించిన ఎఆర్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌ను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు.

ఆర్థిక భద్రతపై 60 శాతం మంది దిగులు

- ఎడెల్విస్ లైఫ్ రిపోర్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్

భారత దేశంలో ఆర్థిక భద్రతపై 60 శాతం మంది దిగులు పడుతున్నారని ఎడెల్విస్ లైఫ్ అధ్యయనంలో తేలింది. 12 నగరాల్లోని 4,005 మంది అభిప్రాయాలను సేకరించి.. ఈ రిపోర్ట్‌ను తయారు చేసింది. ఎంత ఆదా చేశాను లేదా పెట్టుబడి పెట్టినా అనేదానికి సంబంధం లేకుండా అది భవిష్యత్ కోసం ఎప్పుడు సరిపోదని 35-54 ఏళ్ల మధ్య భావిస్తున్నారు. ఈ జనరేషన్ వారు రెండు తరాల కొరకు ఆర్థికంగా సహాయపడతారు. వృద్ధులు అవుతున్న తమ తల్లిదండ్రులు, పెరుగుతున్న పిల్లల కోసం. కుటుంబం పట్ల వారి బాధ్యత, ఆర్థిక నిర్ణయాలను నడిపిస్తున్నాయని ఎడెల్విస్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండి, సిఇఒ సుమీత్ రాయ్ పేర్కొన్నారు. ఉత్పత్తి మార్గాల్లో ఎక్కువగా ఉపయోగించే జీవిత బీమా, ఆరోగ్య బీమా, మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీస్, బ్యాంక్ ఎఫ్‌డిల్లో 60 శాతం కంటే తక్కువ మందికి పెట్టుబడులు ఉన్నాయని తమ అధ్యయనంలో వెల్లడయ్యిందన్నారు.

'ఎస్ఎల్‌బిసి'పై నిపుణులతో విచారణ జరపాలి

- ప్రమాదానికి బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణం
- నేటి నుంచి స్థానిక సమస్యలపై పోరుబాట
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తీవ్ర విషాదం నింపిన ఎస్ఎల్‌బిసి ఘటనపై పూర్తిస్థాయిలో నిపుణులతో న్యాయ విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి శనివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు నల్లగొండ శివారులో మర్రిగూడ బైపాస్ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. బైకులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బిసి టన్నెల్ వ్యవహారంలో మొండిగా వ్యహరించి ప్రమాదానికి కారణమయ్యాయని జాన్‌వెస్లీ చెప్పారు. అక్కడ పొట్ట చేత పట్టుకుని వచ్చిన కూలీలకు మూడు నెలలుగా వేతనాలు కూడా ఇవ్వలేదని రైతు కూలి సంఘం నాయకులు తమ దృష్టికి తీసుకొచ్చి ఆందోళన వ్యక్తం చేసినట్టు చెప్పారు. టన్నెల్‌లో ఇంత ప్రమాదం జరిగినా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులు చేయకుండా పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్రానికి పైసా కూడా కేటాయించకపోవడంపై బాధ్యత వహించి కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో దళితులకు పదిహేను శాతం కేటాయించాల్సి ఉండగా ఏడు శాతం మాత్రమే కేటాయించారని, జనాభాలో 50 శాతం ఉన్న బిసిల ఊసే లేదని, దేశం మొత్తంలో మైనార్టీలకు మూడున్నర కోట్లు మాత్రమే కేటాయించారని వివరించారు.

రాష్ట్ర ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన పేదల ఇండ్లకు నిధులు కేటాయించబోమని చెప్పడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 14 మాసాలు అవుతున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజల పక్షాన ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

నేటి నుంచి పోరుబాట

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో.. అభివృద్ధికి నిధులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జాన్‌వెస్లీ చెప్పారు. క్షేత్రస్థాయిలో స్థానిక సమస్యలపై మార్చి రెండు నుంచి 31 వరకు సిపిఎం ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

హామీలను అమలు చేయాలి : జూలకంటి రంగారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర విభజన చట్టం మార్గదర్శకాలు అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పనులను కూడా పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మిర్చి రైతుల గోడు ప్రభుత్వానికి పట్టడం లేదని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, సయ్యద్ హాషం, లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి జండర్ బడ్జెట్

- ఐద్వా నేత ఎస్ పుణ్యవతి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా సంక్షేమానికి జండర్ బడ్జెట్‌ను కేటాయించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025-26 బడ్జెట్ మహిళా సంక్షేమానికనుగుణంగా లేదని విమర్శించారు. మహిళల విద్యా, వైద్యం, ఉపాధి, తదితర రంగాలకు తగిన విధంగా కేటాయించాలన్నారు. కానీ కేంద్రం ఆ పని చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళాభివృద్ధికి కేవలం రెండు శాతం మాత్రమే నిధులు కేటాయించారనీ, మహిళా సంక్షేమానికి నూటికి 53 పైసలు మాత్రమే కేటాయించటం శోచనీయమన్నారు. ఉపాధి హామీకి 2023 - 24లో రూ.89.59 కోట్లు కేటాయించగా 2025లో రూ.86 వేలకోట్లు మాత్రమే కేటాయించటమేంటని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు వేతనాలు ఆరేండ్లుగా పెంచడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి ప్రభుత్వమే రోజుకు రూ. 250 కూలిని నిర్ణయించగా వీటిలో సగం కూడా రావడం లేదని గుర్తు చేశారు. ఆరోగ్యానికి కూడా కేటాయింపులు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులు గిరిజనులు, మైనార్టీలకు నిధులు వాటా ప్రకారం వారికి కేటాయించలేదన్నారు. సమావేశంలో సీనియర్ నాయకురాలు డి. జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కోశాధికారి మాచర్ల భారతి, సహాయకార్యదర్శి ఆశలత, బుగ్గవీటి సరళ, ఉపాధ్యక్షులు నలిగంటి రత్నమాల, ఎమ్. వినోద, షభాన బేగం, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తికి కాశీంనగర్ ఎత్తిపోతల మంజూరు : సర్కారు ఆదేశాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆరు గ్రామాలు, 13 గిరిజన తాండాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు సాగునీటిని అందించే కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆదివారం సర్వే పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ కింద కాశింనగర్, జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తాయిపల్లి, అంజనగిరి గ్రామాలతోపాటు మరో 13 గిరిజన తాండాలకు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి ఈ పథకం ఉపయోగపడనుంది. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ సహా ఇతర ప్రతిపాదిత నీటి వనరులకు ఈ ప్రాంతం ఎత్తుగా ఉండటం వల్ల కాశింనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేసినట్టు సమాచారం. ఎన్నో ఏండ్లుగా చివరి ఆయకట్టుకు సాగునీరు రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కాశింనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డికి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మెన్ జి చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

జనం బాధలను చెప్పేదే ప్రజా కవిత్వం

- "తెగ మురిసే మేక" సంకలనం అందుకు ప్రతీక
- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనం బాధలను వ్యంగ్యంగా, ధిక్కార స్వరంతో చెప్పేదే ప్రజా కవిత్వమని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. యువ కవి విష్ణుప్రసాద్ రాసిన "తెగ మురిసే మేక" సంకలనాన్ని హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..సమాజంలో మన కళ్ల ముందు అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నా మనకెందుకులే అనే ధోరణి ప్రజల్లో ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సమాజానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. విష్ణుప్రసాద్ తన కవితా సంకలనంలో సమకాలీన సమస్యలు, ప్రజల బాధలకు అక్షర రూపం ఇచ్చారని కొనియాడారు. టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ మాట్లాడుతూ.. సాధారణ జర్నలిస్టుగా రెండు దశాబ్దాల ప్రయాణంలో ఎదురైన అనుభవాలను రంగరించి విష్ణుప్రసాద్ ఈ సంకలనాన్ని తెచ్చారని పేర్కొన్నారు. పుస్తకం ఆద్యంతం పాలకుల తీరును ఎండగట్టారని అన్నారు. రాజకీయ కసాయిల చేతిలో ప్రజలు బలి కాకూడదనే ఈ టైటిల్‌ను ఎంచుకున్నారని అభిప్రాయపడ్డారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ ఆనందాచారి మాట్లాడుతూ జర్నలిస్టుగా వ్యక్తీకరించలేని సమస్యలను ఈ సంకలనంలో విష్ణు అక్షరీకరించారని అన్నారు. వంద తుపాకులు ఎక్కుపెట్టినా తాను భయపడననీ, ఒక్క అక్షరానికి భయపడుతానని అమెరికా మాజీ అధ్యక్షులు అబ్రహం లింకన్ చెప్పారని పేర్కొంటూ.. పుస్తకం ప్రాముఖ్యతను గుర్తు చేశారు. కవిని ఒక ప్రాంతానికి పరిమితం చేయడం సరికాదనీ, విశాల దృష్టి కోణంలో చూడాలని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ జనం భాషలో జనం బాధలను రాయడం గొప్ప విషయమన్నారు. హైదరాబాద్ నగరంలో ఫార్మా పొల్యూషన్‌తో పాటు అనేక సమస్యలున్నాయనీ, కవులు, రచయితలు వాటిని తమ రచనల ద్వారా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. మేధావులు మౌనంగా ఉంటే ఆ సమాజం వెనక్కి నడుస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ సమావేశానికి నవతెలంగాణ జీఎం పి.నరెందర్‌రెడ్డి వందన సమర్పన చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ.శ్రీధర్‌రెడ్డి, సామాన్యశాస్త్రం వ్యవస్థాపకులు కందుకూరి రమేష్‌బాబు, యువ కవి నరేష్‌కుమార్ సూఫీ, డీబీఎఫ్. జాతీయ కార్యదర్శి పి.శంకర్, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గల్ఫ్ కార్మికుల ఎక్స్‌గ్రేషియా నిధులను విడుదల చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 113 గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లింపు కోసం నిధులను విడుదల చేసేందుకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును ఆదేశించారని తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కమాండల్ కంట్రోల్ సెంటర్‌లో ఖనిజాభివృద్ధి శాఖ సమీక్ష సందర్భంగా అనిల్ ఈరవత్రి గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన నిధులను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

కార్మికుల కుటుంబాలకు పరిహారమివ్వాలి

- బిఆర్‌టియు డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల ప్రాణాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాపాడలేకపోయిందని బిఆర్‌టియు విమర్శించింది. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలనీ, మరణించిన వారి కుటుంబాలకు రూ. కోటి నష్టపరిహారంగా చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ నారాయణ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ... టన్నెల్ పనులకు సంబంధించి కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్మికుల సంక్షేమం పట్టదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకర్ల సమావేశంలో బిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారయ్య కూడా పాల్గొన్నారు.

జూపల్లి అండతోనే కొల్లాపూర్‌లో దాడులు : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కొల్లాపూర్ నియోజకవర్గం నార్యనాయక్ తండాలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ గూండాల దాడిని భారత రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. సతాపూర్‌లో జరిగిన దాడి మరవకముందే మరోసారి బిఆర్ఎస్ శ్రేణులపై ఇలా దాడి చేసిన సంఘటన చూస్తే కాంగ్రెస్ అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోందని అర్థమవుతోందని తెలిపారు. కాంగ్రెస్ నేతలు వరుస దాడులకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమై అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ప్రజాపాలన అంటే పీకల్లోతు కష్టాల్లో ఉన్న ప్రజల గొంతు వినిపించిన వారిపై విచక్షణా రహితంగా దాడి చేయడమేనా? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం నాటి ఎమర్జెన్సీ రోజులకు కొల్లాపూర్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అండదండలతోనే ఈ విష సంస్కృతి రోజురోజుకూ పెరిగిపోతోందని తెలిపారు. ఇలాంటి దాడులకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఈ అసమర్థ ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

బిఆర్ఎస్ శ్రేణులపై దాడి దుర్మార్గం : హరీశ్‌రావు

కొల్లాపూర్‌లో బిఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ గూండాల దాడి దుర్మార్గమని మాజీ మంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. ఏడాది కింద వరకు శాంతియుతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హింస, నేరాలు పెరిగిపోతున్నాయని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్‌లోని నార్యనాయక్ తండాలో బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడి ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆ పార్టీ నాయకులను ఉసిగొల్పుతూ నిజంగానే మార్పు తెచ్చారని తెలిపారు. కాంగ్రెస్ మార్క్ ఎమర్జెన్సీని ఆ పార్టీ కొల్లాపూర్‌లో అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు గర్హనీయమని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరుల దాడులు పెరిగిపోతున్నా పోలీసులు నిమ్మకునీరెత్తినట్టు ప్రవర్తిస్తున్నారని తెలిపారు.

కనకగిరి అడవుల్లో పక్షుల కనువిందు

- ఆసియా ఖండంలోనే అరుదైన బర్డ్స్
- కెమెరాల్లో బంధించిన వైల్డ్‌లైఫ్ నిపుణులు
- వివిధ దేశాల నుంచి వలస వచ్చిన కలర్‌ఫుల్ బర్డ్స్
- ఉదయాన్నే ట్రెక్కింగ్ చేస్తూ ప్రకృతి అందాలతోపాటు వీక్షించొచ్చు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విస్తరించి ఉన్న కనకగిరి అడవుల్లో అరుదైన దృశ్యాలు ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నాయి. ఈ అడవుల్లో పచ్చని చెట్ల మధ్య గలగలపారే సెలయేరులతో ఏర్పడిన పులిగుండాల ప్రాజెక్టు పరిసరాల్లో ఎన్నో అందమైన దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. దాదాపు 50 వేలకు పైగా ఎకరాల్లోని కనకగిరి అడవుల్లో అరుదైన పక్షులు అనేకం ఉన్నట్టు అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ ఎన్జీవో సంస్థల సర్వేలో బయటపడుతున్నాయి. ఆసియా ఖండంలోనే అరుదుగా దాదాపు పదుల సంఖ్యలో ఉండే పక్షులు సైతం ఇక్కడికి వలస వస్తున్నట్టు వైల్డ్‌లైఫ్ నిపుణులు గుర్తించారు. తమ కెమెరాల్లో వాటి అందాలను బంధించారు. ఆ అరుదైన పక్షులు, వాటి నేపథ్యం ఏంటో 'నవతెలంగాణ' పాఠకుల కోసం వన్యప్రాణి నిపుణులు నవీన్ బాల, సుజిత్, ప్రదీప్, శశాంక్, ప్రణయ్, బయాలజిస్ట్ నితిన్, ఎఫ్ఆర్వో ఉమ, డీఆర్వో సురేష్‌కుమార్, గైడ్ శివకృష్ణ నవీన్, సుమన్ తదితరులు వివరించారు.

దేశదేశాల నుంచి వలస పక్షులు

కనకగిరి అడవులకు దేశదేశాల నుంచి పక్షులు వలస వస్తున్నాయి. ఇక్కడ అవి జీవించేందుకు అనువైన వాతావరణం ఉండటంతో వచ్చినవి తిరిగి వెళ్లడం లేదు. మధ్య ఆసియా, రష్యా నుంచి కొన్ని పక్షులు ఇక్కడికి వచ్చాయి. పెనుబల్లి మండలం పులిగుండాల నుంచి చంద్రుగొండ మండలంలోని కనకగిరి గుట్టలు, పాలకొయ్యలొద్ది తదితర ప్రాంతాల్లో ఇవి సంచరిస్తున్నాయి. నేపాల్, ఆసియా ప్రాంతాల్లో సంచరించే ఎర్రమూతి రామచిలుక ఈ ప్రాంతానికి వలుస వచ్చినట్టు వన్యప్రాణి నిపుణులు తెలిపారు. పెయింటెడ్ స్పర్‌పోల్ పక్షులు (ఆడ, మగ) ఇక్కడ సంచరిస్తున్నాయి. ప్రేమ పక్షులు, గ్రే హెడెడ్ స్వం పెయిన్ పక్షులు (కుటుంబ పక్షులు), క్రెస్టెడ్ హవాక్ ఈగల్, కోకిల మాదిరిగా ఉండే సర్పెంట్ ఈగల్, ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్ పక్షులు, మలబార్ ట్రోగాన్ పక్షులు, మ్యాంగ్రోవి బ్లూ ఫ్లైక్యాచర్ పక్షులు ఓ ఐదారు ఇక్కడ తిరుగుతున్నాయి. బెట్టు ఉడుత, పూనుగు పిల్లి, ఆసియా పామ్ సివెట్, 14 చీతలు, 10 ఎలుగుబంట్లు, దుప్పులు, అడవి దున్నలు, రకరకాల తోడేళ్లు తదితర జంతువులను సైతం నిపుణులు గుర్తించారు. వీటితోపాటు పలు రకాల చేపలు, నక్షత్రాల తాబేళ్లు సైతం కెమెరాలకు చిక్కాయి. అంతరిస్తున్న ఈ పక్షి, జంతుజాలాన్ని అడవిలో ట్రెక్కింగ్ చేస్తూ చూడవచ్చు. ప్రతియేటా అక్టోబర్ నుంచి జనవరి వరకు వీటిని చూసేందుకు అనువైన కాలం. ఉదయాన్నే వెళ్తే ప్రస్తుత సమయంలోనూ వీటిని వీక్షించొచ్చు. ఖమ్మం నుంచి 50 కి.మీ దూరంలో ఈ కనకగిరి అడవులు కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండల సరిహద్దుల్లో ఉన్నాయి.

ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్

ఆసియాకు చెందిన ఇండియన్ ప్యారడైజ్ ఫ్లైక్యాచర్ అంతరిస్తున్న పక్షుల జాబితాలో ఉంది. ఇది భారత ఉపఖండం, మధ్య ఆసియా, మయన్మార్‌కు చెందినదిగా గుర్తించారు. పొడవాటి తోక ఈకలు ఉండే ఈ పక్షి ఎంతో అందంగా ఉంటుంది. మగ పక్షులు నల్లటి తలతో పొట్టి తోక కలిగి ఉంటాయి. దట్టంగా ఉండే చెట్ల మధ్య ఇవి ఎక్కువగా కనిపిస్తాయి.

టికెల్స్ బ్లూఫ్లై క్యాచర్ బర్డ్

ఆసియా ఖండంలోనే అత్యంత అరుదుగా ఉన్నది టికెల్స్ బ్లూ ఫ్లై క్యాచర్ బర్డ్. ఈ పక్షులు ఓ ఐదారు కనకగిరి అడవుల్లో వన్యప్రాణి నిపుణుల కెమెరాలకు చిక్కాయి. చూడ్డానికి ఎంతో అందంగా నీలివర్ణంలో మిరుమిట్లు గొల్పుతూ ఉండే ఈ పక్షి.. కీటకాలను తిని జీవిస్తుంది. ఇక్కడి అడవుల్లో ఇవి జీవించడానికి అనువైన వనరులు ఉన్నట్లు వైల్డ్‌లైఫ్ నిపుణులు గుర్తించారు.

ఎర్రమూతి రామచిలుకలు

ఇవి సాధారణ రామచిలుకల కంటే కూడా అందంగా ఉంటాయి. వీటి తలభాగం మొత్తం పూర్తిగా ఎర్రగా చూడటానికి ఆకర్షణీయంగా ఉంటుంది. నేపాల్ నుంచి ఈ పక్షి కనకగిరి అడవులకు వలస వచ్చింది.

గ్రేహెడెడ్ స్వంపెయిన్ పక్షులు

గ్రేహెడెడ్ స్వంపెయిన్ పక్షులు వీటిని కుటుంబ పక్షులు అని కూడా అంటారు. ఇవి ఎక్కడ ఉన్నా మూడు, నాలుగు కలిసి గుంపుగా ఉంటాయి. పిల్లలతో కలిసి ఓ కుటుంబంగా ఆడ, మగ పక్షులు జీవిస్తాయి. ఆసియా ఖండంలోనే ఈ పక్షులు అరుదుగా ఉన్నాయి. ఇవి కాక కింగ్‌ఫిషర్ (వడ్రంగి పిట్టలు), పలు రకాల గద్దలు అనేకం ఇక్కడ ఉన్నాయి. అంతరిస్తున్న అనేక జీవులను ఈ అడవిలో ట్రెక్కింగ్ చేస్తూ మనం చూడొచ్చు.

ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లే కీలకం

- వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉత్కంఠ
- గెలుపుపై అంచనా వేసుకుంటున్న అభ్యర్థులు
- ఫోకస్ పెట్టిన ఎగ్జిట్ పోల్స్ సర్వే సంస్థలు
- నర్సిరెడ్డికి 36 శాతం విజయావకాశాలు ఉన్నట్టు సర్వేలు
- ఆ తర్వాతి స్థానంలో 31 శాతంతో శ్రీపాల్‌రెడ్డి..
- తర్వాతి స్థానాల్లో పూల రవీందర్, హర్షవర్ధన్‌రెడ్డి
- 3న ఫలితాలు.. అందరిలోనూ ఉత్కంఠ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇప్పుడు ఏ ఎన్నికలైనా.. ఎన్ని తక్కువ ఓట్లున్నా.. ఎగ్జిట్‌పోల్స్ సర్వసాధారణంగా మారాయి. దీనిలో భాగంగా 25,797 మాత్రమే ఓట్లున్న వరంగల్-ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల తీర్పుపైనా ఉత్కంఠ నెలకొంది. కేవలం టీచర్లే కాకుండా మిగతా వర్గాల్లోనూ ఈ ఎన్నికలపై ఆసక్తి నెలకొనడంతో ఎగ్జిపోల్ సర్వే సంస్థలు ఈ ఎన్నికలపైనా ఫోకస్ చేశాయి. ఈ ఎన్నికల్లో పోటీ పడిన కొందరు అభ్యర్థులు సర్వే సంస్థలను ఉపయోగించుకోవడంతో వారు ఫలితాలను విశ్లేషించారు. దీనిలో భాగంగా సీ-ప్యాక్, ఆరా మస్తాన్, కోడెమో వంటి సంస్థలతో పాటు కొన్ని యూట్యూబ్ చానల్స్ సైతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితాలపై విశ్లేషణ చేశాయి. ఈ మూడు సర్వే సంస్థల అంచనాల ప్రకారం టిఎస్ యుటిఎఫ్, టిపిటిఎఫ్‌తో పాటు మరో 21 సంఘాలు బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నాయి. బ్యాలెట్ పత్రాలతో జరిగిన ఈ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమంలో ఓట్లేసే అవకాశం ఉన్న దృష్ట్యా ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు కీలకంగా మారే అవకాశం ఉందని కూడా సంస్థలు విశ్లేషించాయి.

36 శాతం ఓట్లతో అలుగుబెల్లికే ఎక్కువ విజయావకాశం..!

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం మొత్తం 12 జిల్లాల్లోని 93 మండలాల్లో విస్తరించి ఉంది. ఈ నియోజకవర్గ వ్యాప్తంగా 25,797 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం ఏర్పాటు చేసిన 200 పోలింగ్ కేంద్రాల్లో 24,133 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వీరిలో ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డికే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని సర్వే సంస్థలు అంచనా వేశాయి. ఆరా మస్తాన్ అనే సర్వేసంస్థ అత్యధికంగా 38.4 శాతం, సీ-ప్యాక్ 36.1 శాతం ఓట్లు వస్తాయని తేల్చాయి. ఒక కోడెమో మాత్రం శ్రీపాల్‌రెడ్డి (33.4 శాతం) కన్నా కేవలం 0.1 శాతం ఓట్లతో అలుగుబెల్లి (33.5శాతం) ముందుంటారని పేర్కొంది. ఇక ఈ మూడు సర్వేసంస్థలు ఇచ్చిన రిపోర్టుల ప్రకారం అలుగుబెల్లి తర్వాతి స్థానాల్లో సరాసరిన శ్రీపాల్‌రెడ్డి 31 శాతం, పూల రవీందర్ 15 శాతం, హర్షవర్ధన్‌రెడ్డి 8 శాతం, బిజెపి అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డి 7 శాతం, ఇతరులు 3 శాతం ఓట్లు సాధిస్తారని అంచనా వేశాయి. ఈ సర్వేలతో పాటు అలుగుబెల్లి విజయావకాశాలపై ఆయన్ను బలపరిచిన సంఘాలు, ఉపాధ్యాయ వర్గాలు మాత్రం విశ్వాసంతో ఉన్నాయి.

నియోజకవర్గంలో బలంగా టిఎస్ యుటిఎఫ్

ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో టీఎస్ యూటీఎఫ్, టిపిటిఎఫ్ బలంగా ఉన్నాయి. మొత్తం 12 జిల్లాల్లో కలిపి టిఎస్ యుటిఎఫ్‌కు సుమారు 15 వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. వీరిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు లేదు. వారిని మినహాయిస్తే తక్కువలో తక్కువగా సభ్యత్వం ఉన్నవారిలో 10వేల మంది ఓటుహక్కు కలిగి ఉన్నారు. టీఎస్ యూటీఎఫ్‌కు తోడు మరో 22 సంఘాల మద్దతు కూడా నర్సిరెడ్డికి ఉండటం కూడా లాభించిందనే అంచనాలు ఉన్నాయి. మరో ప్రధాన సంఘం పిఆర్‌టియు నేతలు ముగ్గురికి పైగా పోటీ పడ్డారు. వీరిలో శ్రీపాల్‌రెడ్డి, పూల రవీందర్, హర్షవర్ధన్‌రెడ్డి పిఆర్‌టియు ఓట్లను తలాకొన్ని చీల్చుకున్నారని సర్వేసంస్థలు విశ్లేషిస్తున్నాయి. వీరికితోడు సుందర్‌రాజు యాదవ్‌కు కొన్ని బీసీ ఓట్లు పడి ఉంటాయని లెక్కగట్టాయి. శ్రీపాల్‌రెడ్డికి పీఆర్టీయూ ఓటర్లలోనూ ఆయనకు సానుకూల ఓట్లు ఆశించిన స్థాయిలో పడలేదని అంచనా.

సౌమ్యుడు.. పనిచేస్తాడనే నర్సిరెడ్డి వైపు మొగ్గు..!

ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న నర్సిరెడ్డికి సౌమ్యుడు, ఉపాధ్యాయుల కోసం నిరంతరం పనిచేస్తారనే పేరుండటం కలిసి వచ్చిందని విశ్లేషణలు ఉన్నాయి. ఎవరు ఫోన్ చేసినా ఆయనే స్వయంగా ఆన్సర్ చేస్తారని ఉపాధ్యాయవర్గాల్లో చర్చ ఉంది. సమస్యల పరిష్కారం కోసం ఆయన గతంలో చేసిన కృషి, ప్రలోభాలకు లొంగని కమిట్‌మెంట్ ఉన్న సంఘాల మద్దతు.. ఇవన్నీ నర్సిరెడ్డిని విజయతీరానికి చేర్చుతాయనే అంచనాలు వేశాయి. వరంగల్‌తో పోల్చితే ఉమ్మడి ఖమ్మం, నల్లగొండలో నర్సిరెడ్డికి అధిక ఓట్లు పోలైనట్టు తెలుస్తోంది. పోలింగ్ రోజున నర్సిరెడ్డి వరంగల్ జిల్లాపై ఫోకస్ చేసి పోలింగ్ బూత్‌లకు తిరగటం కూడా లాభించిందనే అంచనాలున్నాయి. అయితే పోటీ తీవ్రంగా ఉన్న దృష్ట్యా గత ఎన్నికల్లో మాదిరిగా ఈ ఎన్నికల్లోనూ ద్వితీయ ప్రాధాన్యత ఓటు వరకు వెళ్లాల్సి రావొచ్చని భావిస్తున్నారు. అలా జరిగినా మిగతా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసినవారిలో అత్యధికులు ద్వితీయ ప్రాధాన్యత ఓటు నర్సిరెడ్డికే వేశారని సర్వే సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. ఉపాధ్యాయ వర్గాలు కూడా ఇదే అభిప్రాయాన్ని వెలువరిస్తున్నాయి. మొత్తమ్మీద ఈనెల 3వ తేదీన ఈ ఎన్నికల ఫలితాల వరకూ ఉత్కంఠ కొనసాగనుంది.